ఎర్రబారుతున్న తెల్లబంగారం

- పెరిగిన తేమశాతం
- రంగు మారుతున్న పత్తి పైరు
- దిగుబడి భారీగా తగ్గే అవకాశం
- ఆందోళనలో రైతాంగం



ఎర్రగా మారుతున్న పత్తి పంట



ఎర్రగా మారిన ఆకులు

కౌతాళం: పత్తి సాగు చేసిన రైతాంగానికి ఈ ఏడాది కూడా అప్పులు కష్టాలు తీరేట్లు లేదు. తెల్లబంగారం సాగు చేసిన రైతులంతా తెల్లముఖాలు వేసుకున్నారు. రెండు సంవత్సరాల నుంచి ఆశించిన వర్షాలు లేక పంటలు అంతంత మాత్రంగానే వచ్చాయి. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ ప్రారంభం ముందు నుంచే వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. అయితే ఆగష్టు నెలలో కురిసిన వర్షాలతో మండలంలో ప్రధానంగా సాగైన పత్తి పంట భూమిలో తేమ శాతం ఎక్కువ కావడంతో పైరు ఎర్రగా మారి కాయలు రాలిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

21,600వేల హెక్టార్లల్లో పత్తి సాగు

మండలంలో 21,600వేల హెక్టార్లల్లో (54వేల ఎకరాల్లో)పత్తి పంటను సాగుచేశారు. జూలైలో వచ్చిన వర్షాలతో రైతులు సంతోషించారు. వర్షాలు సమృద్ధిగా రావడంతో ఇక పంటలు బాగా పండుతాయని ఆశించి ఎకరాకు 8 నుంచి 10 బస్తాల ఎరువులు వేశారు. యూరియా కోసం అష్టకష్టాలు పడ్డారు. యూరియా దొరక పోతే కాంప్లెక్స్ ఎరువులు అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేసి మరీ వేశారు. ఇప్పటికే ఎకరాకు రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చుపెట్టారు. సెప్టెంబర్ మొదటి వారం నుంచే పత్తి వస్తుందని వ్యవసాయ పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారుల వద్ద తీసుకున్న అప్పులు కట్టవచ్చని భావించిన రైతన్న ఆశలు భారీ వర్షాల వల్ల తడారిపోతున్నాయి. సెప్టెంబరు రెండవ వారం మొదలైన ఇంకా భూమిలో తెమ శాతం తగ్గడం లేదు. దీంతో పంట ఎర్రగా మారుతోంది. పత్తి పంట సాగుచేసిన రైతులతో పాటు మిరప, వాము, వేరుశనగ పంటల పరిస్థితి అలాగే ఉంది. అధిక వర్షల వల్ల భూమిలో తేమ శాతం ఎక్కువై పంటలు కుళ్లిపోతున్నాయి.

పెట్టుబడులు కూడా రాని పరిస్థితి

ఈ ఏడాది అధిక వర్షాల వల్ల పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్లు దిగుబడి వస్తుందన్న ఆశలు పెట్టుకున్న రైతన్నలు అసలు పెట్టుబడైన వస్తుందా అన్న సందేహం వ్యక్తం చేస్తున్నారు. రోజు రోజుకి పత్తిపంట ఎర్రబారుతుండడంతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయే అవకాశం ఉందని రైతులు మహమ్మద్, ఉసేని, జాఫర్, హనుమంతు, ఖాసీం, మంజునాథ్, యూసుఫ్, ఎల్లప్ప, ఉసేన్‌బాషా, తాయన్న చిన్నీఈరన్న, మౌల సాబు, ఖాదర్‌బాషా తదితరులు తెలిపారు. ఇక తమకు ఈ ఏడాది కూడా అప్పుల మూట తప్పదంటున్నారు.

పంటంతా ఎర్రగా మారింది



4ఎకరాల్లో సాగుచేసిన పత్తి పంటంతా తేమ అధికం కావడంతో ఎర్రగా మారింది. పంట ఇలా రంగు మారడంతో దిగుబడి వస్తుందా అనే సందేహం కలుగుతోంది. గతంలో పంట ఇలాగే రంగుమారి ఎకరాకు 5 క్వింటాళ్లు కూడా పత్తి రాలేదు. ప్రతి ఏడాది ఇలాగే జరిగితే వ్యవసాయం చేయడం కష్టంగా మారుతుంది. **–మహబూబ్‌బాషా, కుంటనహాల్**

ప్రభుత్వం పరిహారాన్ని ప్రకటించాలి



రైతులకు ఏటా నష్టాల వల్ల పంటలు సాగు చేసిన పెట్టిన పెట్టుబడులు రావడం లేదు. ఇప్పటికే పత్తి పంట ఎర్రగా మారుతున్నది దీంతో ఈఏడాది కూడా నష్టం తప్పదని తెలుస్తుంది. ఈ సంవత్సరమైన పండిన పంటకు కనీసం క్వింటాలు పత్తి రూ.10వేలకు తగ్గకుండా మద్దతు ధర ప్రకటించాలి. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం వేంటనే పరిహారాన్ని ఇవ్వాలి. **–వెంకోబ**

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పత్తి పంటలను కాపాడుకునేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. డీఏపీగ గాని, 28–28–0 గాని, 19–19 కాంప్లెక్ గాని కేజీ ఎకరాకు పిచికారీ చేయాలి లేదా నానో యూరియా 500 ఎంఎల్ పిచికారి చేస్తే పంటలోని తేమ శాతం తగ్గి పటలు యథాస్థితికి వస్తాయి. పంటలను ఎర్రబారకుండా కాపాడుకోవచ్చు. **–శేషాద్రి, ఏఓ**

నీటి పన్ను వసూలు చేయండి

నందవరం : గ్రామాల్లో నీటి పన్ను వసూలు చేయాలని వీఆర్వోలు, వీఏలకు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు, వీఏలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..రైతుల వద్ద నీటి పన్ను వసూలు చేయాలని, రెవెన్యూకు ఆదాయం పెంచాలని వివరించారు. అలాగే రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, సర్వేయర్లు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌డీటీ మహేష్, ఆర్ఐ రవీంద్ర రెడ్డి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

నందవరం : రైతులకు అందుబాటులో యూరియా ఉందని తహసీల్దార్ శ్రీనివాసులు, మండల వ్యవసాయ అధికారిణి సరిత తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో కోర మాండల్, కిసాన్ అగ్రిమాల్‌లో తహసీల్దార్, ఏఓ ఎరువులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. మండలంలో నాగలదిన్నె, నందవరంలో యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. రైతులకు అవసరమైన వరకే యూరియాను కొనుగోలు చేయాలన్నారు. నాగలదిన్నెలో శివకిరణ్ ట్రేడర్స్ 8 మెట్రిక్ టన్నులు, నందవరం కిసాన్ అగ్రిమాల్‌లో 5 మెట్రిక్ టన్నులు, కోర మాండల్‌లో 5 మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులో ఉందని వివరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌డీటీ మహేష్, ఎంపీఈఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉల్లి ముందస్తు కోతలు వద్దు



పార్లపల్లిలో ఉల్లిగడ్డల సైజును పరిశీలిస్తున్న ఏవో శివశంకర్

ఎమ్మిగనూరురూరల్: ఉల్లి సాగు చేసే రైతులు ముందస్తుగా కోతలు కోయకుండా ఉల్లిగడ్డ సరైన సైజు వచ్చిన తర్వాతనే కోతలు కోయాలని మండల వ్యవసాయాధికారి ఎం. శివశంకర్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉల్లి పంట 100 నుంచి 110 రోజులకు కోతకు వస్తుందని, అప్పుడు మాత్రమే కోత కోయలని ముందుగా కోస్తే గడ్డ చిన్నగా ఉండి ధర తక్కువుగా పలుకుతుందని చెప్పారు. ఉల్లిని ఆరబెట్టిన తరువాత మార్కెట్‌కు తీసుకెళ్లాలని అప్పుడే ప్రభుత్వ మద్దతు ధర వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు రసూల్, వినోద్, వీహెచ్‌ఏ రమేష్, వీఏఏ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ ఫోన్ వాడకంతో అనర్థాలు



సెల్ వాడకంతో అనర్థాలను విద్యార్థులకు వివరిస్తున్న శక్తిటీమ్ ఏఎస్ఐ నటరాజ్

ఎమ్మిగనూరురూరల్: మొబైల్ వాడకం వలన ఎన్నో అనర్థాలు జరుగుతాయని శక్తి టీమ్ ఏఎస్ఐ నటరాజ్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మాసుమాన్‌దొడ్డిలో ఎంపీపీ స్కూల్లో సెల్ ఫోన్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్ ఎక్కువుగా చూడటం వలన మానసిక రోగులుగా మారి చదువులో వెనకబడిపోతారన్నారు. ఎవరైనా కొత్తవారు చాక్లెట్స్ ఇస్తే తీసుకోరాదని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. హెచ్‌ఎం శాంతిరాజు, పీసీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపకుడికి సన్మానం



అధ్యాపకులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కౌతాళం : ప్రతి అధ్యాపకుడు ఉత్తమ అధ్యాపకుడిగా ఎదగాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్ అన్నారు. జంతు శాస్త్ర అధ్యాపకుడు సంతోష్‌కుమార్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికైన విషయం విదితమే. బుధవారం కళాశాలలో అధ్యాపకుల సమక్షంలో ఆయనను శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. ఆయనతో పాటు బదిలీపై వెళ్తున్న పౌరశాస్త్ర అధ్యాపకుడు రవికుమార్‌కు కూడా సన్మానం చేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



సిద్ధ మల్లికార్జునను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: పట్టణంలోని క్రాంతినగర్‌లో నివాసముంటున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సిద్ధ మల్లికార్జున కిడ్నీకి సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఇటీవల కర్నూలు కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని ఆదోనికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఆదోని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి బుధవారం సిద్ధ మల్లికార్జున ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని, తిరిగి యథావిధిగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సీనియర్ నాయకులు నగరూరు చంద్రశేఖర్‌రెడ్డి, రామలింగేశ్వరయాదవ్ ఉన్నారు.

రైతులకు సరిపడా యూరియా అందిస్తాం

ఆదోని రూరల్: రైతులకు యూరియా అందుబాటులోనే ఉందని, రైతులకు సరిపడా యూరియా అందిస్తామని ఏడీఏ బాలవర్ధిరాజు, ఏఓ సుధాకర్ తెలిపారు. బుధవారం మండలంలోని బసాపురం గ్రామంలో రైతులకు పంపిణీ చేసిన యూరియాను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ బసాపురం గ్రామంతో పాటు ఇతర గ్రామాలకు కలిపి మొత్తం 75.6 టన్నుల యూరియా పంపిణీ చేశామన్నారు. రైతులు నానో యూరియా వాడకం ద్వారా కలిగే ప్రయోజనాలు, దాని సమర్థత, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే విధానాలపై అవగాహన కల్పించారు. వరి సాగు చేసిన ప్రతిరైతు తగినంత యూరియా సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అధికారులు వరి పంట పొలాలను పరిశీలించి, పంటల పెరుగుదల పరిస్థితులు, ఎరువుల వినియోగాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ సతీష్, ఎంపీఈఓ టి.చిన్న అయ్యన్న, వీఏఏ వీరేష్ పాల్గొన్నారు.

వీరనారి చాకలి ఐలమ్మ



చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పలు సంఘాల నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పెత్తందార్లకు, రజాకర్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ, సత్తనపల్లి రామకృష్ణల ఆశయ సాధనకోసం కృషి చేయాలని రజక వృత్తిదారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గురుశేఖర్, జిల్లా మహిళా నాయకురాళ్లు ఎల్ఎస్ రత్నమ్మ, ఉద్యోగుల సంఘ నాయకుడు సిద్దప్ప, రామన్న పిలుపునిచ్చారు. పట్టణంలోని పద్మశాలి కల్యాణ మండపంలో బుధవారం చాకలి ఐలమ్మ, రామకృష్ణల వర్ధంతి సభను నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన రజక కులానికి చెందిన వారిని సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ భరత్, హెచ్‌ఎం విరుపాక్షి, ఎంఈఓ నాగప్ప, జిల్లా సంఘ నాయకులు శ్రీనివాసులు, జయమ్మ, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి రజక సంఘ నాయకులు చాకలి వీరేష్, కృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాయలసీమ అభ్యుదయ విద్యార్థి సంఘ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఖాజ, వాల్మీకి సంఘ నాయకులు మంజునాథ్, నరసన్న, ఉరుకుందు తదితరులు పాల్గొన్నారు.

దళిత సమ్మేళన సభను జయప్రదం చేయండి

గోనెగండ్ల: ఎమ్మిగనూరు పట్టణంలోని కుర్ని కళ్యాణ మండపంలో ఈనెల 13న జరిగే దళిత సమ్మేళన సభను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్. దేవ సహాయం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన సాధన కమిటీ చైర్మన్ కదిరికోట ఆదెన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జి. ఆనంద్ చైతన్య పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రం గోనెగండ్లలో దళిత సమ్మేళన సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. భకు మండలంలోని ప్రతి గ్రామం నుంచి దళితులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి కరుణాకర్, తాయప్ప, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా గుంతలు పూడ్చిన అధికారులు



కంకరతో నాసిరకంగా పూడ్చిన గుంత

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో సబ్ రిజిస్టార్ కార్యాలయం, పంచాయతీ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై పడిన గుంతలను అధికారులు తూతూ మంత్రంగా కంకర వేసి పూడ్చి చేతులు దులుపుకున్నారని సీపీఐ మండల అధ్యక్షులు గోపాల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్ ఆరోపించారు. బుధవారం గుంతలలో నాసిరకంగా కంకర వేసి వదిలేసి రోడ్లను పరిశీలించారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 8న ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రోడ్లకు ఇరువైపులా ఉన్న వ్యాపార దుకాణాలలో గుంతలను పూడ్చేందుకు విరాళాలు సేకరించామన్నారు. ఇందుకు స్పందించిన అధికారులు గుంతలను పూడ్చేందుకు ఉపక్రమించారని చెప్పారు. అ. కేవలం కంకర రాళ్లను వేసి వదిలేశారన్నారు. రోడ్ల మరమ్మతుల కోసం కేటాయించిన నిధులు ఎమయ్యాయని వారు ప్రశ్నించారు. రైతు సంఘం మండల అధ్యక్షుడు తాయన్న, డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు ఓంకార్ స్వామి, విద్యార్థి సంఘం నాయకులు సిద్దు, నరసింహులు, చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

అంటరానితనాన్ని రూపుమాపాలి



మాట్లాడుతున్న చిక్కం జానయ్య మాదిగ

ఆదోని రూరల్: దళిత గిరిజనుల పట్ల అంటరానితనాన్ని రూపుమాపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య మాదిగ అన్నారు. బుధవారం పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఏర్పడినా దళిత, గిరిజనులపై దాడులు, హత్యలు, మానభంగాలు, కుల వివక్షత, అంటరానితనం తగ్గడం లేదన్నారు. వీటిని అరికట్టడంలో ప్రభుత్వాలు, పోలీసు, రెవెన్యూ వ్యవస్థ కూడా విఫలమయ్యిందన్నారు. త్వరలోనే ఆదోని నియోజకవర్గంలో లక్ష మంది దళిత గిరిజనులతో కవాతును జై భీమ్ ఎమ్మార్పీఎస్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జై భీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సలహాదారుడు అంజినయ్య మాదిగ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాదాసుల రాజబాబు, ఆదోని మండలాధ్యక్షులు గుమ్మల రాజేంద్ర మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఏడీజేయూ నూతన కమిటీ ఎన్నిక

ఆదోని అర్బన్: ఆంధ్రప్రదేశ్ డెమోక్రటిక్ జర్నలిస్ట్ యూనియన్(ఏడీజేయూ) నూతన కమిటీ ఎన్నిక బుధవారం స్థానిక కార్యాలయంలో జరిగింది. నూతన గౌరవాధ్యక్షులుగా టి.ఈరన్న, అధ్యక్షుడిగా మగ్దూంబాషా, ప్రధాన కార్యదర్శిగా బలరాంసింగ్, ఉపాధ్యక్షులుగా నరసప్ప, ఆర్గనైజింగ్ సెక్రటరీ వై.ఎండీ.గౌస్, జాయింట్ సెక్రటరీగా రవీంద్రగౌడ్, ట్రెజరర్‌గా గౌస్ మహమ్మద్, గౌరవ సలహాదారుడిగా నాగరాజ్, గౌరవ ఉపాధ్యక్షులుగా డేవిడ్‌లను ఎన్నుకున్నారు.

ఉన్నది ఒకటే జీవితం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న క్లినికల్ సైకాలజిస్ట్ అన్విత్‌మిత్ర

ఆదోని అర్బన్: ఉన్నది ఒకటే జీవితం ఆత్మహత్యలకు పాల్పడవద్దని లయన్స్ క్లబ్ సభ్యులు నినదించారు. లయన్స్ క్లబ్ ఆదోని వారి ఆధ్వర్యంలో పట్టణంలోని నోబుల్ ఒకేషనల్ కాలేజీలో ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. క్లినికల్ సైకాలజిస్ట్ అన్విత్‌మిత్ర మాట్లాడుతూ ఆత్మహత్యలకు గల కారణాలు, వాటిని ఎలా గుర్తించాలి, నివారించే మార్గాలు తదితర అంశాల గురించి తెలియజేశారు. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, దీర్ఘకాలిక వ్యాధులు, ప్రేమ వ్యవహారాలు, పరీక్షల ఫెయిల్యూర్, విద్యార్థులు పరీక్షల ఒత్తిడి, చదువుల ఒత్తిడి తదితర కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఒత్తి డిని అధిగమించి ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్‌లు డాక్టర్ గోపీనాథ్, ప్రసాద్‌రావు, అధ్యక్ష కార్యదర్శులు ధర్మారెడ్డి, శ్రీనాథ్‌గుప్తా, కోశాధికారి వనపరాజు, విశిష్ట సభ్యులు డాక్టర్ ఉషా, లలిత, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ



క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను అందజేస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయులు

దేవనకొండ: మున్సిపల్ ఉపాధ్యాయుల సహకారంతో పేద క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్ల పంపిణీ కార్యక్రమం బుధవారం పట్టణంలోని టీబీ యూనిట్‌లో చేపట్టారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, ఎంఈఓటీసీ డాక్టర్ షేకున్‌బాను ఆధ్వర్యంలో మున్సిపల్ ఉపాధ్యాయులు ఫయాజుద్దీన్, నిరంజన్‌కుమార్, మీనాక్షిలు పేద క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను అందించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి మాట్లాడుతూ పేద క్షయవ్యాధిగ్రస్తులను దత్తత తీసుకుని వారికి పోషకాహారం అందించడం చాలా గొప్ప విషయమన్నారు. 15 మందికి రూ.1000 విలువ చేసే పోషకాహార కిట్లను ఆరు నెలలపాటు ఇచ్చేందుకు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇలా ప్రతిఒక్కరూ పేదవారిని దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు బాబురాజు, మంజునాథ్, భాస్కర్, టీబీహెచ్ వి.సుబ్బమ్మభాయి, పద్మావతి, రవికుమార్, వీరేష్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలో నిర్వహించిన సీఐటీయూ మండల మహాసభలో భాగంగా బుధవారం రెండో రోజు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాలుగు లేబర్ చట్టాలను రద్దు చేసి కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇచ్చి, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు 62 సంవత్సరాల పదవీ విరమణ జీఓలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఐటీయూ మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోవిందు, ఉపాధ్యక్షులుగా గోవర్ధనమ్మ, నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా రాముడు, సహా య కార్యదర్శులుగా శైలజ, శివలక్ష్మి, నాగలక్ష్మి, రమేష్, ఇస్మాయిల్, కోశాధికారిగా ఖాజలను ఎన్నుకున్నారు.

బోధనేతర పనుల నుంచి మినహాయించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నందవరం : ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు ఎస్. దావీదు, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లప్ప డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలతో పాటు ముగతి, జగ్గాపురం గ్రామాలలోని పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు రణభేరి పోస్టర్లను విడదల చేశారు. వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 15 నెలలు గడిచిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నేరవేర్చలేదని ఆరోపించారు. నాణ్యమైన విద్యను అందిస్తామని చెబుతూనే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు తరలిపోయే కార్యక్రమాలు రూపొందించారని విమర్శించారు. విద్యాసంవత్సరం ప్రాంభంలోనే యోగాంధ్ర, మెగాపేరెంట్ మీటింగ్ అంటూ బోధనకు ఆటంకం కలిగించారన్నారు. ఉపాధ్యాయులు స్వేచ్ఛాయుత వాతావరణంలో బోధనపై కేంద్రీకరించే పరిస్థితులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే ప్రచార బైక్ యాత్రను యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వెంకటరాముడు, నాగరాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం రైతుల పాట్లు

- వర్షాలకు దెబ్బతిన్న పంటలు
- అరకొరగా యూరియా
- పంటలు కాపాడుకునేందుకు ఎరువుల కోసం అన్నదాతల అవస్థలు



గోనెగండ్లలో యూరియ కోసం క్యూలో వేచివున్న ఉన్న రైతులు

గోనెగండ్ల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలు ఇటీవల మండలంలో కురిసిన వర్షాలకు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంటలకు ఎరువులను చల్లకోవడానికి అనువైన సమయంగా రైతులు భావించారు. దీంతో రైతులు ఎరువుల కోసం ఎరువుల దుకాణాలు, సొసైటీల వద్దకు వెళ్తే ఎరువుల కొరత తీవ్రంగా కనిపిస్తోంది. కొద్ది రోజులుగా ఎరువులు దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అరకొరగా రైతు సేవా కేంద్రాలకు వచ్చిన యూరియా రైతులకు సరిపడడం లేదు.

21,992 ఎకరాలలో పంటల సాగు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే మండలంలో 21,992 ఎకరాలలో పత్తి, ఉల్లి, వేరుశనగ, మిరప, సజ్జ తదితర పంటలు సాగు చేశారు. ఎరువుల ధరలు పెరగడంతో సాగుచేసిన పంటల కోసం వాటిని కొనుగోలు చేసేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. యూరియా బస్తాలు రైతులకు సరిపడ దొరకడం లేదు. బయట షాపుల యాజమానులు ఇతర మందులు కొంటే యూరియా ఇస్తామని చెపుతున్నారని రైతులు తెలుపుతున్నారు. కావున వ్యవసాయ అధికారులు చొరవ తీసుకొని యూరియాతో పాటు ఇతర ఎరువులు రైతులకు అవసరమైన మందులను రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉండేవిధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.

యూరియా కొరత లేదు



మండలానికి ఆది, సోమవారం 17.55 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. మండలానికి వచ్చిన యూరియా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంది. ఆదివారం నుంచే రైతులకు యూరియా పంపిణీ ప్రారంభించాం. ఎరువుల కొరత లేకుండా చూసుకుంటున్నాం. **– మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు**

యూరియా కోసం ఇబ్బందులు



నేను మూడు ఎకరాలలో వేరుశనగ పంట సాగుచేశా. సాగుచేసిన పంటకు యూరియా చల్లాలి. ప్రస్తుతం రైతులకు యూరియా దొరకడం లేదు. మా గ్రామంలో రైతు సేవా కేంద్రానికి యూరియా వచ్చింది. యూరియా కోసం రైతులు క్యూలో నలబడి తీసుకెళుతున్నాం. ఒక రైతుకు మూడు బస్తాలు కంటే ఎక్కువ ఇవ్వడం లేదు. దీంతో పంటలకు యూరియా సరిపోవడం లేదు. బయట కొంటే ఎరువులు కోలుగోలు చేస్తేనే యూరియా ఇస్తారు లేకపోతే లేదు. యూరియాను ఎప్పుడు పడితే అప్పుడు పంపిణీ చేయకుండా మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన యూరియా, ఇతర మందులు, ఎరువులను అందుబాటులో ఉంచి రైతులకు అందించాలి. **– వీరేష్, రైతు, అలువాల గ్రామం**

ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదు



మండలంలో సాగుచేసిన పంటల ఎదుగుదల కోసం రైతులు ఎరువులు చల్లుకోవాల్సి ఉంది. రైతులు యూరియా కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం ఎరువులను కూడా రైతులకు సకాలంలో అందించలేకపోతుంది. రైతుల ప్రభుత్వం అని చెప్పుకోవడమే తప్ప రైతులకు చేసింది ఏమీ లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఎరువులను సకాలంలో అందించాలి. **– ఎస్‌బీ మన్సూర్, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్, గోనెగండ్ల**

జింక పిల్ల అప్పగింత



పోలీసులకు జింక పిల్లను అప్పగిస్తున్న దృశ్యం

దేవనకొండ: పత్తికొండ మండలం కనకదిన్నె గ్రామంలో సమీపంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న జింక పిల్ల దేవనకొండకు చెందిన కుక్కల కాసీంకు బుధవారం దొరికింది. ఆయన దేవనకొండ పోలీసుల సమక్షంలో పత్తికొండ ఫారెస్టు రేంజర్ ఆఫీసర్ రవి కుమార్‌కు జింక పిల్లను అప్పగించారు.

ఎల్లెల్సీలో గుర్తు తెలియని మృతదేహం

హొళగుంద: మండలంలోని సుళువాయి–సమ్మతగేరి గ్రామల మధ్యన తుంగభద్ర దిగువ కాలువలో బుధవారం గుర్తు తెలియని యువకుడి శవం కొట్టుకుపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడు 25–30 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందని, గళ్ల చొక్కాక్క, ప్యాటు ధరించాడని చెప్పారు. హొళగుంద పోలీసులను విచారించగా తమకు సమాచారం అందలేని చెప్పారు.

యూరియా సక్రమంగా పంపిణీ చేయాలి



ఈదులదేవరబండ వద్ద ఉల్లి రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

దేవనకొండ: రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా సక్రమంగా పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక మన గ్రోమోర్ ఔట్‌లెట్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మన గ్రోమోర్ యూరియా ఔట్‌లెట్‌లో యూరియా సరఫరా, స్టాకు, పంపిణీపై రిజిస్టర్‌లను పరిశీలించి యజమానిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఖరీఫ్ సీజన్‌కు మాత్రమే యూరియా ఇప్పుడు తీసుకోవాలని, రబీ సీజన్‌కు మళ్లీ వస్తుందని రైతుల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. ఆరోగ్యశ్రీ కింద ఎన్ని ఓపీ కేసులు రిజిస్టర్ అయ్యాయని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. క్యాజువాలిటీలో వైరల్ ఫీవర్‌తో అడ్మిట్ అయిన 7వ తరగతి విద్యార్థికి అందిస్తున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. 150 వరకు ఓపీ ఉందని, ల్యాబ్ టెక్నీషియన్ ఎందుకు లేరని వివరణ ఇవ్వాలని డీఎంహెచ్ఓను ఫోన్‌లో ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. అలాగే.. పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశమై పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని చెప్పారు. ఈదులదేవరబండ గ్రామంలో ఉల్లి రైతులతో మాట్లాడుతూ ఆరబెట్టిన ఉల్లిని తీసుకొస్తే గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆర్డీఓ భరత్‌నాయక్, తహసీల్దార్ రామాంజనేయులు, ఏఓ ఉషారాణి ఉన్నారు.